# గొడుగు

## – కొత్తపల్లి ఉదయబాబు

''మాదాకోళం తల్లీ!''

కంచుకంఠంతో గుమ్మం ముందు అరుస్తున్న ముష్టివాడి అరుపుకు ఠకీమని మెలకువ వచ్చేసింది.

తలంతా శూలాలతో పొడుస్తున్నట్టుగా, కపాలంలో చెయ్యిపెట్టి దేవుతున్నంత బాధగా వుంది. దాంతో కోపం నషాళాన్నంటింది నాకు.

''ముకుందా'' గట్టిగా అరిచాను నేను.

ఉహు! ఎలాంటి సమాధానమూ రాలేదు.

లేచి వీధిగుమ్మంలోకి వచ్చాను.

''అయ్యగారు! ఓ కరుడు అన్నం ఉంటే పెట్టించ డయ్యా! భోజనం చేసి రెండురోజులయినాది'' అన్నాడు వాడు జాలిగా నన్నుచూసి.

పిల్లలు మామిడిచెట్టు క్రింద బెంచీమీద చెస్ ఆడుకుంటున్నారు.

ముకుంద గోడ అవతల నిలబడ్డ ప్రక్కింటి శాస్త్రి గారి భార్యతో కబుర్లు చెబుతోంది ఏమీ పట్టనట్టు.

''ముకుందా!'' విసుగ్గా అరిచాను నేను.

''మళ్ళీ వస్తాను పిన్నిగారూ! ఆయన లేచినట్టు న్నారు'' అనేసి గబగబా ఇవతలకు వచ్చింది.

''అయ్యో! అపుడే లేచిపోయారా! ఏమయ్యా! పొమ్మని చెబితే నీకుకాదూ. ఎన్నిసార్లు చెప్పాలి? సెలవురోజు కూడా పట్టుమని పదినిముషాలు పడు కోనివ్వరు కదా ఆయన్ని. బంగారంలాంటి ఆయన నిద్ర పాడుచేశావు. వెళ్ళు. వెళ్ళవతలకి!'' అంది విసవిసా అతనివైపు తిరిగి.

''అయితే ఇంతసేపూ నువు ఇక్కడే నిలబడివుండి కూడా వాడికోముద్ద వెయ్యలేకపోయావన్నమాట. ఏమ్రా! మీరైనా కాసిని బియ్యం తెచ్చి వెయ్య వచ్చు కదరానానీ'' అన్నాను నా పుత్రరత్నాన్ని ఉద్దే శించి.

''అనవసరంగా వంటింట్లో చేరి అన్నింటిలోనూ అడ్డమైన చేతులు పెడితే వీపు చీరేస్తానని అమ్మ వార్నింగ్ ఇచ్చింది డాడీ!'' తన బాధ్యత తీరిపోయి నట్టు టపాకాయ సమాధానం చెప్పి అక్కగారితో ఆటలో మునిగిపోయాడు వాడు.

''సర్సరే! వెంటనే వెళ్ళి అతనికి ఏదో ఒకటి తెచ్చి వెయ్యి'' అన్నాను లోపలకు నడవబోతూ.

''హు! పెళ్ళాం అంటే మీకు ఏనాడు విలువ ఉంది కనుక! అందరి ముందూ నన్ను లోకువ చెయ్యడమేగా మీకు తెలిసిన విద్య. ఆ వేసేదేదో మీరే వేసుకోండి'' నాకేసి ఆముష్టివాడికేసి నిప్పులు కురిసే చూపు చూసి లోపలికి వెళ్ళిపోయింది నా శ్రీమతి ముకుందాదేవి.

ఇంక ఘర్షణ పడితే బాగుండదని అతనికి దగ్గ రగా వచ్చాను. అపుడు చూశాను అతన్ని! అతను కుష్టివాడు. జ్వరం బాగా ఉండికాబోలు సన్నగా వణుకుతున్నాడు. సరిగా నిలబడలేకపోతున్నాడు కూడా!

లోపలకి వెళ్ళి ఆక్టిమాల్ టాబ్లెట్, అయిదు రూపా యలనోటు తీసుకొచ్చి అతని సంచీలో వేశాను.

కళ్ళలో సన్నటి కన్నీటి పొర తిరుగుతుండగా మౌనంగా చేతులు జోడించి నెమ్మదిగా కర్ర సాయంతో ముందుకు సాగిపోయాడతను.

దాదాపుగా ఆ సంఘటన మరిచేపోయాను.

• • •

సుమారు నెలరోజుల తర్వాత!

సాయంత్రం యింటికి వచ్చేసరికి హడావుడిగా ఎదురొచ్చింది ముకుంద.

''ఏమండీ పిల్లాడు కనబడటంలేదండీ!'' అంది కంగారుగా.

''వీధిలోనే ఎవరింట్లోనో ఆడుకుంటూ ఉంటాడులే'' నిర్లక్ష్యంగా అనేసి లోపలకు నడవబో యాను.

''అపుడే రెండు గంటల నుంచీ వెతుకుతున్నా నండీ! అక్కా! నువ్వు పుస్తకాలు తీసుకుని యింటికె ళ్ళిపో! మా ఫ్రెండ్ యింటికి వెళ్ళి నోట్సు తీసు కుని నే వెనకాలే వచ్చేస్తాను అని పిల్లను యింటికి పంపేసి అంట్లవెధవ యింతవరకూ యింటికి రాలేదు. వాడే వస్తాడు కదా అని పిన్నిగారి దగ్గర కొత్త అల్లిక నేర్చుకుంటూ ఉండిపోయాను. స్కూలు నుంచి వస్తూనే పది నిముషాలకి ఓసారి ఏదయినా పెట్టమని పీక్కుతినే వెధవ! యింతవరకూ రాకపోతే అనుమానం వచ్చింది. వీధిలో అందరిళ్ళకీ వెళ్ళొ చ్చాను. పాపం టెలిఫోన్ ఆపరేటర్‌గారి భార్య, ఎదు రింటి బ్యాంక్ ఆయన పెళ్ళాం, వీధి చివర కంట్రా క్టర్‌గారి అబ్బాయి, వీధిలో యిస్త్రీబండి నారా యణ, కిళ్ళీకొట్టు గోపాలం అందరూ తలోవైపుకీ వెళ్ళారండీ. ఆఫీసుకు మీకు ఫోన్ చేద్దామనుకుం టుంటే మీరే వచ్చారు. ఎక్కడున్నాడో! ఎలా ఉన్నాడో వెర్రినాగన్న!'' బావురుమంది ముకుంద.

దాంతో నాకూ కంగారు పుట్టింది.

''సర్సరే! నేను పోలీస్‌స్టేషన్లో రిపోర్టు ఇచ్చి బయట అన్నిచోట్ల వెదుకుతాను. నేను రావడం ఆలస్యమైతే నువేం కంగారుపడకు. ప్రక్కింటి పిన్ని గార్ని తోడు తెచ్చుకో!'' అనేసి బయటకు వచ్చే శాను.

పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చాను. ఏపని అయినా నాకు సంబంధించినంత వరకూ స్వయంగా చేస్తేనే గాని ఆత్మతృప్తి కలగని నేను వీధి వీధి – పేట పేట సైకిలు వేసుకుతిరిగాను. రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్, బస్‌స్టాప్స్ ప్రతీచోట తిరిగాను.

విపరీతమైన నీరసం వచ్చేసింది నాకు.

కన్న మమకారం– కన్నీటి పొరై చూపు మసకబా రింది.

ఆఫీసులోకి వచ్చి ఫోన్ దగ్గర కూర్చున్నాను.

మధ్యలో 'ముకుంద'కు మూడుసార్లు ఫోన్ చేశాను.

ప్రక్కింటి శాస్త్రిగారింట్లో ఫోన్ ఉంది.

''పిల్లాడు రాలేదండీ!'' అంటూ ఫోన్లో బావురు మన్న 'ముకుంద'ని శాస్త్రిగారి భార్య ఓదార్పు మాటలతో శాంతింప జేయడం వింటూనే 'కంగారు పడవద్దని' ఫోన్ పెట్టేశాను.

అన్నానేగానీ నా బాధ ఎవరితో చెప్పుకోను?

ఈ ప్రపంచంలో 'ఆడది' అంటే ఉండే సింపతీ 'మగవాడు' అంటే ఉండదెందుకో. ఒక ఆడదాన్ని ఓదార్చడానికి, చుట్టూ పదిమంది చేరి పదిరకాల మాటలతో ఓదార్పు పేరుతో ఆమెను మరింత ఏడి పించడానికి ఎంతోమంది అమ్మలక్కలు సిద్ధంగా ఉంటారు. అదే మగాడు ధీరోధాత్తుడులా నిబ్బ రంగా, తల్లి శవం కళ్ళముందు కాలుతున్నా కంట నీరు పెట్టని రాజీవ్‌గాంధీలా హుందాగా వ్యవహరిస్తే

అతడిని అసలు సిసలైన 'హీరో'గా నిర్ణయించి వేనోళ్ళ పొగడుతారు. అంతేగాని అతని మనసులోకి తొంగిచూడరు.

ఈ యుగాంతం వరకూ విశ్రాంతి తీసుకుంటే బాగుండును అన్నంత నిస్పృత్తువ నన్నావరించింది.

బల్లమీద టెలిఫోన్ కేసి చూస్తూ ఆలోచనలో పడిపోయాను.

• • •

''ముకుంద'' నా జీవితంలో అనుకోకుండా ఓ 'తుఫాను'లా ప్రవేశించింది.

నాకు 'అక్క' వయసులో ఉండే స్నేహితురాలు ఉండేది. ఆమె పేరు కరుణ. ఆమె, నేను కాన్వెంట్‌లో పనిచేసేవాళ్ళం. డిగ్రీ పూర్తిచేసి పైచదువు చదివే అవకాశంలేని ప్రతీ కుర్రవాడు ఈనాడు చేస్తున్నపని నేను పన్నెండేళ్ళ క్రితమే చేశాను. ఆ కరుణక్క తాతగారింట్లో ఒక వాటాలో 'ముకుంద' అక్కగారు, (అంటే మా వదినగారు), మరొకవాటాలో ఒక బ్యాంకు ఆఫీసరుగారు ఉండేవారు. ఆ బ్యాంకు ఆఫీసరుగారి అమ్మాయి సంబంధం మాకరుణక్క అమ్మతో చెప్పడం, ఆయన వచ్చి పెళ్ళిచూపులకి ఆహ్వానించడం, పెళ్ళిచూపులలో తాంబూలాలు మరునాడు పుచ్చుకునేందుకు మా యింటికి వచ్చి పెళ్ళి ముహూర్తం నిర్ణయించేందుకు వస్తానన్న ఆయనకు 'నేను ఒక స్త్రీలోలుడనని' ఒక ఆకాశరామన్న ఉత్తరం అందడం, ఆయన తాను స్వయంగా వస్తానన్న పెద్దమనిషి తాను రాకుండా 'మీ సంబంధం మాకు అవసరం లేదు' అని ఆయన కబురు పంపటం, ఆ సంబంధం చెడిపోయిందన్న సంతోషంతో ఎక్కడో అనకాపల్లిలో ఉన్న తల్లిదండ్రుల దగ్గరకు మా వదినగారు అంటే ముకుంద అక్కగారు పరుగెత్తుకెళ్ళి చెప్పడం, వాళ్ళు తిరుగుటపాలో వచ్చి పెళ్ళిచూపులకు ఆహ్వానించడం, తిరిగి ఆ పెళ్ళిచూపులు 'తప్పిపోయిన' సంబంధంగల యింటి మరోవాటాలో అంటే మా వదినగారు కాపురం ఉండే వాటాలో జరగడం, 'ముకుంద' నాకు నచ్చడం, తాంబూలాలు అక్కడే పుచ్చుకుని, భోంచేసి మాయింటికి వచ్చేయడం, సరిగ్గా ఎనిమిదో రోజున మా వివాహం జరగడంతో 'ముకుంద' అనే తుఫాను నా జీవితంలో భార్యగా లభించింది.




అలాంటి 'ముకుంద'ది చాలా తొందరపాటు స్వభావం. ఆలోచించకుండా పెద్దంతరం, చిన్నంతరం లేకుండా మాట అనేయడం ఆ తర్వాత కొంపలు మునిగిపోయినట్లు బాధపడటం తనకి నరనరాన యింకిపోయిన తత్వం- మారమన్నా మారేది కాదు. ఏ భావమూ మనసులోనేకాదు, ముఖంమీద కూడా దాచుకోలేని బోళాతనం తనది.

''కాలు జారినా తీసుకోవచ్చుగాని, నోరు జారితే తీసుకోలేం'' అని తనకి ఎన్నోసార్లు నచ్చచెప్పాను.

''పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోనే పోనీయండి'' అంటుంది.

భర్తగా జీవితాంతం నాకు తప్పదు కాబట్టి భరిస్తాను. మావీధిలో ఆమె ఎవరితోనైనా మాట్లాడిందో అది దెబ్బలాటేనన్నమాట. ఆత్మాభిమానం ఉన్నవాళ్ళెవరూ తిరిగి ఆమెతో మాట కలపడానికి సాహసించేవారు కాదు. అయితే ముకుంద హాబీయే వేరు. లేనిపోనివి వూహించేసుకుని యిర్రిటేట్ అయిపోవడం, ఆ యిర్రిటేషన్ తగ్గాక తనే మళ్ళీ వాళ్ళతో ''అలాంటివి మనసులో పెట్టుకుంటే ఎలాగండీ వదినగారు! ఏదో యిరుగు పొరుగు అన్నాక మంచి వస్తే కలిసిపోవాలి. చెడొస్తే మాటామాట అనుకోక తప్పదు కదా!



## కీటకాల కర్రీ

థాయ్‌లాండ్‌లోని వ్యవసాయదారులకు గ్రాస్ హాపర్స్ అనే కీటకాలతో పెద్ద బెడదొచ్చిపడింది. అవి వారి ధాన్యాలపై గుంపులుగా దండెత్తి, వాటిని ధ్వంసం చేస్తున్నాయి. ఆ కీటకాల నిర్మూలన కొరకు వ్యవసాయదారులు ఓ కొత్త పథకం పన్నారు. దొరికినవాటిని దొరికినట్లు పట్టుకొని, రకరకాల వంటలుగా వండుకొని హాయిగా నమిలిమింగుతున్నారు. ఇందువలన వారికి కీటకాలను నాశనంచేసే మందులను కొనడం, వాటికయ్యే భారీ ఖర్చు నుంచి తప్పించుకోవడం జరుగుతోంది! అంతేకాక, ఆహారంలోకి అవసరమైన కూరలకు అయ్యే ఖర్చు కూడా తగ్గుతోంది. ఎలాగైనా థాయ్ రైతులు తెలివైనవారే.

## మొసళ్లు! మొసళ్లు!

అదీ, ఇదీ అని లేదు- ఏదైనా మనిషికి ఆహారమైపోతోంది. అతి భయంకరమైన, ఏవగింపు కలిగించే మొసళ్లు కూడా మనిషికి రుచికరమైన ఆహారంగా మారిపోతున్నాయి. ఏకంగా, హొండూరా అనే ప్రభుత్వమే మొసళ్ల విధ్వంశానికి నడుంకట్టింది. అనేక దేశాలకు ఆ ప్రభుత్వం మొసలి మాంసాన్ని ఎగుమతి చేసి బాగా డబ్బు గడిస్తోంది. మొసళ్ల పెంపకానికి అనేక ఫారమ్‌లను ఏర్పాటుచేసింది. మన చేపల చెరువులవలె అచ్చట అనేకంగా మొసళ్ల చెరువులు ఏర్పాటు జరిగింది. కరేబియన్ తీరాల్లో అనేక మొసళ్ల తటాకాలు వ్యాపారపరంగా రూపొందించారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో మొసలి వేపుడుమాంసానికి గిరాకీ ఉందట. చూశారా, పాపం మొసళ్లకు ఏగతి పట్టిందో!

\- కొడిమెల

పోనీ ఈవేళ్టితో పోయేదా! నేను ఏమైనా తప్పుగా మాట్లాడితే క్షమించేయండి. అంతేగాని మనసులో ఏదో పెట్టుకుని మాత్రం నాతో మాట్లాడవద్దు. ఏదైనా అనవలసివస్తే నా ముఖాన్నే అడిగేయండి!'' అనేసరికి ఆమె ఫ్రాంక్‌నెస్‌కి ఆమెకి వీధి వీధంతా స్నేహితులే!

స్థానికంగా ఉంటున్న నాకే ఆవీధిలో ఎవరెవరు నివసిస్తున్నారో తెలియదు. అయితే 'ముకుంద'కి మాత్రం వాళ్ళ వాళ్ళ చుట్టాలు, స్నేహితులతో కూడా మంచి సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకుంది. ఎవరింటికి ఏచుట్టం వచ్చినా ముందు ముకుందకి కనిపించి, పలకరించి, వాళ్ళ అనుభవాలన్నీ చెప్పుకుని మరీ వెడతారు. చివరకి పార్లమెంట్ రద్దయినాసరే- ప్రతీదీ అడిగి తెలుసుకుంటుంది.

అలాంటి 'ముకుంద'కి పిల్లలతోటిదే ప్రపంచం. ప్రపంచం అంటేనే తనూ- తన పిల్లలూ! నేను లేకుండా కొన్నిరోజులైనా ఉండగలదేమోగాని వాళ్ళు కనిపించకపోతే కొన్ని గంటలు కూడా ఉండలేదామె.

అందరూ మౌనంగా బాధపడే విషయానికి ఆమె హృదయ విదారకంగా ఏడ్చేస్తుంది. మనిషిని తీగలా అల్లుకుపోయి, ఏడ్చే ఆ ఏడుపుకు ఎంతటి పాషాణుడైనా సరే, ఆ పాషాణం క్రింద జల తన్నుకుంటూ పైకి రావాల్సిందే!

అంత మోస్ట్ పెక్యూలియర్ అండ్ డెలిబరేట్ కారక్టర్ షి ఈజ్!

రోజుకి ఎంతమంది ముష్టివాళ్ళు వచ్చినా గుప్పెడు బియ్యం వేయడం ఆమె ప్రత్యేకత. అయితే వారు ఖచ్చితంగా అంగ వికలురై ఉండాలి. అయితే ఎవరిముందైనా తనని అవమానం చేస్తే అంటే తన మాటకాదని నేను ముష్టివేస్తే ఆరోజుల్లా నాకు అక్షింతలే!

తను ముష్టివేసినపుడు మాత్రం ''ఏం పట్టుకుపోతామండీ ఈ వెధవ శరీరంతో'' అంటుంది త్యాగమయిలా.

నా ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తూ అంతలో టెలిఫోన్ గణగణా మ్రోగింది-

''అబ్బాయి దొరికాడండీ'' - దాదాపు ఫోను పగిలేటంత గట్టిగా అరిచింది ముకుంద.

• • •

ముకుంద నుంచి ఫోన్ అందుకుని ఆత్రంగా యింటికి నేను చేరుకునేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది.

మా యిల్లు యిల్లంతా లైట్లేసి ఉన్నాయి.

యింటి ముందు కోలాహలంగా ఉంది.

నేను ఆదుర్దాగా లోపలకి వెళ్ళాను.

గుమ్మంలో కూర్చున్న ముకుంద, పిల్లలిద్దరూ ఒక్కసారిగా పరుగెత్తుకుని వచ్చి నన్ను గాఢంగా హత్తుకుపోయారు. అమ్మయ్య! నాకొడుకు దొరికాడు. నెమ్మదిగా వారిని ఒక్కొక్కరినే నానుంచి విడదీశాను. శాస్త్రిగారి భార్య మా అనురాగాన్ని జుర్రుకు తాగేస్తున్నట్లు చూస్తోంది. ఆవిడకి అదో తుత్తి. వీధిలో ఒక జంట నడిచి వెళ్తుంటే వాళ్ళు కనుమరుగయ్యేటంత వరకూ అలాగే చూస్తూ నిట్టూర్చుతుంది పాపం!

రెండు క్షణాల తరువాత తేరుకుని నేను చుట్టూ ఉన్న గుంపును చూశాను. ఓ పదిహేనుమంది దాకా ఉన్నారు.

వాళ్ళంతా ముష్టివాళ్ళు. వాళ్ళలో నెలరోజుల క్రితం మా యింటికి వచ్చిన కుష్టువ్యాధి అతను కూడా ఉన్నాడు. అతన్ని చూసి పలకరింపుగా నవ్వాను.

వారిలో ఇద్దరు ఒక ఇరవై రెండు సంవత్సరాల కుర్రాడిని పెడరెక్కలు విరిచి చేతులు వెనక్కు పెట్టి తాళ్ళతో కట్టివేశారు. వాడు పారిపోకుండా కాబోలు జబ్బలు గుచ్చి పట్టుకుని ఉన్నారు.

వారంతా నా రాకకోసమే ఎదురు చూస్తున్నట్టుగా అర్థమయింది నాకు.

''ఎవరయ్యా యితను? ఏమిటిదంతా?'' అడిగాను నేను.


కుష్టువ్యాధి అతను ముందుకు వచ్చాడు.

''ఈయేల సాయంత్రం మీ యింటికి వచ్చినపుడు అమ్మగారు బాధపడుతూ అబ్బాయిగారి యిసయం సెప్పారండి. మనూళ్ళో మా ముష్టోళ్ళ సంగానికి నేనే పెసిడెంట్ని బాబయ్యా! మొత్తం వూరు వూరంతా మావోళ్ళని అంపి ఎతికిత్తే, ఈ ఎదవనాకొడుకు అబ్బాయిగార్ని స్కూలుకాడ, మత్తుమందు కలిపిన బిస్కట్టు ఎట్టి తీసుకుపోడానికి సిద్ధమవుతావుంటే, ఈడు, మా యబ్బాయిండి..'' అంటూ దొంగని పట్టుకున్న ఇద్దరిలో ఒకడిని చూపించి కంటిన్యూ చేశాడు.

''ఈడు అడ్ని పట్టుకున్నాడండి. ఆడెవరో కాదు బాబు! మా సంగంలో ఈమధ్యనే చేరాడు ఆళ్ళ అమ్మ, నాన్నసచ్చిపోతే.''

''అరెరె! పాపం!'' అన్నాను.

''మీలాంటి దరమ పెబువులకి గుర్తుండకపోవచ్చు బాబూ! ఓపాలు నాకు ఒంట్లో బాగుండక మా యబ్బాయి ముష్టికొత్తే అమ్మగారు ''దుక్కలా ఉన్నావు. ఏదైనా పని చేసుకోరాదూ'' అని కసిరేరంట. అపుడు తమరొచ్చి అమ్మగార్ని మందలించి యిసయం అడిగితే ఈడు మాకదంతా మీకు సెప్పేడంట. అపుడు మీరు 'అందరికీ అయితే నేను సాయం చేయలేను. నేనో రెండు వందలు పెట్టుబడి



పెడతాను. చాక్లెట్స్, బిస్కట్స్, కారన్‌ఫ్లేక్స్, లిటిల్ హార్ట్స్ పేకట్సు కొని ఒక ట్రేలో పెట్టుకుని అమ్ముకో' అని రెండొందలు ఇచ్చేరంట- మీరు ఏ మంచితనంతో ఇచ్చారో అంత మంచిగానూ ఆడు వృద్ధిలోకి వచ్చి ఈయేల సిన్న బడ్డీకొట్టు నడుపుకుంటున్నాడు. తమరు మంచి మనసు కలోరు. ఈ యింటి బియ్యం గింజలు తిన్న యిస్వాసం మా సంఘంలో పెతీ ఒక్కరికీ ఉంది బాబు!

ఏ యీదికెళ్ళినా ఎక్కడో ఒకరిద్దరు తప్ప అందరూ మమ్మల్ని సీత్కరించేవోళ్ళే! అయితే మీరు సేసిన సాయానికి ఏంచేసి రుణం తీర్సుకోగలం సెప్పండి!

మీ మంచితనం గొడుగు కింద మాలోటోళ్ళం హాయిగా బతగ్గలుగుతున్నాం. నోరు మంచిదైతే వూరు మంచిదవుద్ది బాబూ! అదే మీ బిడ్డ మీకు దక్కేలా సేసింది.

ఈ ఎదవని పోలీసోళ్ళకి అప్పసెప్పేముందు మీకు సూపిద్దామని తెచ్చామయ్యా!''

నాకు నోటమాట రాలేదు. ఎపుడో సంవత్సరం క్రితం చేసిన సహాయం గుర్తుపెట్టుకుని వారు సంఘటితంగా చూపిన ఐకమత్యం నాకు నా బిడ్డను దక్కేలా చేసింది. ఆ కృతజ్ఞత మనసంతా నిండగా- నేను అతనికి దగ్గరగా వచ్చాను.

''నీ పేరేంటయ్యా?''

''మాదాసు అంటారు బాబయ్యా!''

''చూడు మాదాసు! అతని కట్లు విప్పండి!'' అన్నాను.

''కట్లు యిప్పితే పారిపోతాడేమోనయ్యా!'' అనుమానం వెలిబుచ్చాడు మాదాసు.

''నీ వెనుక అంత సంఘబలం అండగా ఉండగా అతను ఎక్కడకీపోడు'' అని ముకుందవైపు తిరిగి అన్నాను.

''ముకుందా! నా బీరువాలో విడిగా వాడకుండా పెట్టిన ఓ పాత బట్టలజత, ఓ యాభై రూపాయలు ఇలా పట్రా'' అని నేనే వెళ్ళి 'దొంగ' చేతికట్టు విప్పాను.

అతను చేసిన తప్పు అతనినెంత దహించివేస్తోందో అతని ముఖమే చెబుతోంది.

''చూడు బాబూ! ఈ ప్రపంచంలో పుట్టుకతో ఎవరైనా బీదవారు కావచ్చునేమోగాని, నేరస్థుడు మాత్రం కాదు. దొంగతనం కూడా ఒక కళేనట. అయితే 'అది ప్రాణాలతో చెలగాటం'గా మారకూడదు. నా స్థితిలో ఉండి ఆలోచిస్తే నీకు బిడ్డ దూరమైన బాధ తెలుస్తుంది. ఇలాంటి పని మాత్రం యింకెపుడూ చెయ్యకు. కన్నతల్లి ఉసురు తగిల్తే ఈ ప్రపంచంలో పచ్చగడ్డి కూడా మొలవదు'' అని ముకుంద నాచేతికి ఇచ్చిన జత బట్టలు అతని చేతికి ఇచ్చి, ఏభై కాగితం అతని చిరిగి సగం వ్రేలాడుతున్న జేబులో పెట్టాను.

మాదాసుతో అన్నాను-

''చూడు మాదాసు! ఐకమత్యమే మహాబలం అని మేం చదువుకున్నాం. అంతే! కాని మీరు చేసి చూపించారు. మీ సంఘంలో ఇతను ఉన్నంతకాలం ఇతను ఏ తప్పూ చేయడు. నేను చెబుతున్నాను. నామాట మీద నమ్మకం ఉంటే అతనిని వెంటనే వదిలేయండి. నేను పోలీసు రిపోర్టు విత్‌డ్రా చేసుకుంటాను. మీకున్న ఐకమత్యం మా చదువుకున్నవాళ్ళకే ఉంటే సమాజం ఎంతో బాగుపడుతుంది. అవకాశం దొరికితే ఎదుటి మనిషిమీద బురద జల్లే మనుషులున్న మన సమాజంలో ఎదుటి మనిషిలోని మంచితనం గుర్తించే సహృదయం మీకు ఉండడం నిజంగా గర్వించదగ్గ విషయం. మీ సంఘబలంతో పోలీసులు చేయలేని పని మీరు చేశారు. చాలా సంతోషం.''

అని 'దొంగ'కేసి తిరిగి మళ్ళీ అన్నాను.

''చూడు బాబూ! నీ ప్రాణం, నువు పొందిన అవమానం నీకు ఎంతో ఎదుటివారికీ అంతే అని మాత్రం గుర్తుంచుకో.''

అతను అమాంతం నాకాళ్ళు చుట్టేసుకుని బావురుమన్నాడు.

''నన్ను నిజంగా క్షమించండి బాబూ. మా అమ్మ మీద ఒట్టేసి చెబుతున్నాను. మళ్ళీ యిలాంటి తప్పు పని చేయను.

నెలాఖరు రోజులు. కోటా పూర్తవలేదు. ఏదో నేరం చేసి కేసు రాయించుకో. లేదా వూళ్ళో ముస్టెత్తుకోకుండా చేస్తాం'' అని పోలీసోళ్ళు నన్ను బెదిరించి ఈపని చేయించారు బాబు! ఈ ప్లాను చెప్పింది కూడా ఆళ్ళే.''

అందరూ ప్రూన్పడిపోయాము-

''ఆల్లు అదికారంలో పెద్ద'గొడుగు' కింద దాక్కునే వోల్లుబాబు. అందులో ఆల్లదీ తప్పునేదు. గవర్నమెంటోల్లు జీతాలు పెంచకపోతే ఆల్లు మాత్రం ఏటిసేత్తారు. మనం చెయ్యడానికి స్టెయికన్నా ఆయుదంగా వుంది. పాపం! అన్ని ఆయుదాలూ ఉండి ఏమీ సెయ్యలేని బాబులు ఆల్లు-''

జీవితానుభవం నేర్పిన సత్యాలు అవి. మాదాసు పెదవుల నుంచి కాదు. మనసులోంచి వచ్చినవి. నవ్వు వచ్చింది నాకు.

''సరే వెళ్ళిరండి. అన్నట్టు ఈ డబ్బుల్తో టీత్రాగి మరీ వెళ్ళండి'' నా జేబులోనే డబ్బు ఉన్న సంగతి గుర్తుకొచ్చి తీసి మాదాసు చేతిలో పెట్టి ముకుంద, పిల్లలతో యింట్లోకి నడిచాను మనశ్శాంతిగా!

★

## స్వీట్‌షాక్



తమిళంలో 'కండుగొండేన్ కండు గొండేన్' పేరుతో కలైపులిధాను నిర్మిస్తున్న చిత్రానికి ఐశ్వర్యా రాయ్ డేట్స్ ఇచ్చింది. ఆ డేట్స్‌కాక ఎక్స్‌ట్రాగా మరో నాలుగు రోజులు ఆ చిత్రానికి వర్క్ చేసింది. అందుకు తబ్బిబ్బు అయ్యాడో.. మరే విధంగా ఫీలయ్యాడోగానీ, సదరు నిర్మాత, షూటింగ్ పూర్తయ్యాక స్పెషల్ డిన్నర్ ఇచ్చి, ఎయిర్‌పోర్ట్ వరకూ వచ్చి, సెండాఫ్ ఇచ్చి అక్షరాలా అయిదు లక్షలు ఎక్స్‌ట్రా ఆమె చేతిలో పెట్టాడట. స్వీట్‌షాక్ అంటే ఇదే మరి!

## నమ్మొద్దామా!

తమిళ్‌లో ఓ ఊపు వూపుతోన్న సిమ్రాన్ డాన్స్ డైరెక్టర్ రాజుతో ఎఫయిర్ నడిపిస్తోందని, త్వరలో పెళ్ళి కూడా చేసుకోనుందని కబుర్లు వినిపిస్తున్నాయి. అయితే, పెళ్ళయ్యాక సిమ్రాన్ సినిమాల్లో నటించకూడదనే కండీషన్ పెట్టాడట. ససేమిరా కుదర్దని సిమ్రాన్ పేరెంట్స్, అలా అయితే పెళ్ళెలా అవుతుందో చూస్తానని రాజు తండ్రి పట్టుబట్టారట. పాపం రాజు మాత్రం ఏం చేస్తాడు?

- విరాజి

